క్రైం కథ

# నేరం దాగదు

ప్రతాప రవిశంకర్

భాగ్యం పేరున ఒక ఉత్తరం వచ్చింది. ఆరోజు పోస్టులో, ఆ ఉత్తరాన్ని భాగ్యమే చదువుకుంది. ఆమె ఆ ఉత్తరాన్ని చదువుతున్నప్పుడు ఆమె బావగారి కూతురు తులసి అక్కడే వుంది.

ఆ ఉత్తరాన్ని భాగ్యానికి వరసకు తమ్ముడయ్యే చలపతిరావు రాశాడు. తన పిల్లలిద్దరికీ కాలేజీలో సీట్లు వచ్చాయని, డొనేషన్లు కట్టి వాళ్లను చేర్పించాలనీ, అందుకు తనకు యాభైవేలు కావాలని ఆ ఉత్తరంలో రాశాడు. నీ పొలాన్ని అమ్ముతున్న విషయం రైతు రమణయ్య ద్వారా తెలిసింది. ఆయన నాలుగు రోజుల క్రితం మా వూళ్లో కనిపించాడు. ఇవాళో, రేపో అక్కడకు వచ్చి కొంత మొత్తాన్ని నీకు అడ్వాన్సుగా ఇస్తానని చెప్పాడు. ఇప్పుడు అంత డబ్బు నీకు ఎందుకు? నాకు అప్పుగా ఇచ్చావంటే నాలుగు నెలల్లో నీ బాకీని వడ్డీతో తీరుస్తాను. ఒకటి రెండు రోజుల్లో అక్కడు వస్తాను. అంటూ రాశాడు.

ఉత్తరాన్ని చదివి భాగ్యం ఏ విధంగానూ ఫీలవలేదు. నవ్వుకుంది అదోలా. తన భర్త పోయినప్పుడు చలపతిరావు కనీసం కర్మకాండలకు కూడా రాలేదు. ఇప్పుడు డబ్బు కావాలిట.

గంట తర్వాత గౌరీపతి వచ్చాడు. అతను భర్త వైపు దూరపు బంధువు. భాగ్యానికి వరసకు అల్లుడవుతాడు. కూతురికి పెళ్లి కుదిరిందట. వారం క్రితం ఉత్తరం రాశాడు. డబ్బు కావాలని.

భాగ్యానికి మొగుడు లేడనీ, పొదుపుగా ఖర్చు చేసే మనిషనీ, అందువల్ల ఆమె దగ్గర బాగా డబ్బు మూలుగుతుందనీ చాలామంది అనుకుంటారు. ఉత్తరంలో రాసినట్టుగానే ఆరోజున వచ్చాడు గౌరీపతి. డబ్బు గురించి భాగ్యాన్ని అడిగాడు. భాగ్యం మవునంగా వుండిపోయింది.

''పొలం అమ్మావుట గదా''

''అవును. కౌలు సరిగ్గా రావడం లేదు.''

''నిజమే. ఇదే మంచిది. డబ్బును బ్యాంకులో వేసుకుంటే వడ్డీ వస్తుంది'' అన్నాడు గౌరీపతి.

సాయంత్రం నాలుగయినాక తులసి ఇద్దరికీ కాఫీ ఇచ్చింది.

కాఫీ తాగి ''ఇంతకీ నా డబ్బు'' మళ్లీ అడిగాడు గౌరీపతి.

''పది వేలకు మించి ఇవ్వలేను'' చెప్పింది భాగ్యం. నిజానికి గౌరీపతికి డబ్బు ఇవ్వడం ఆమెకు ఇష్టం లేదు. అతనికి డబ్బులు ఇస్తే తిరిగిరావని అందరికీ తెలుసు.

''కష్టం... పదివేలు చాలవు. కనీసం యాభైవేలు కావాలి. మళ్లీ వీలుచూసుకొని వస్తాను.''

''నువ్వు బాధపడినా సరే గౌరీపతీ...నావల్ల కాదు'' ఖచ్చితంగా చెప్పింది భాగ్యం. గౌరీపతికి కోపం వచ్చింది. భాగ్యంతో గొడవ పడ్డాడు. ఆమెను తిట్టి వెళ్లిపోయాడు. వెళుతూ ఇంతకింత అనుభవిస్తావని అన్నాడు.

భాగ్యం బాధపడింది.

ఆ సమయంలో బయట స్కూటరు ఆగిన చప్పుడు వినిపించి తులసి బయటకు వచ్చింది. రోడ్డు మీద గేటుకు ఎదురుగా స్కూటర్ పైన కూర్చుని దయాసాగర్ కనిపించాడు.

దయాసాగర్, తులసి ప్రేమించుకున్నారు. అతనికి యాభైవేలు బాగా అవసరమనీ, భాగ్యం దగ్గర తనకు ఇప్పించమనీ తులసిని అడిగాడు ఇంతకు ముందు.

''అడిగావా?'' అడిగాడు దయాసాగర్.

''ఇంకా లేదు'' చెప్పింది తులసి.

''బాగా అవసరం. వెంటనే అడుగు సాయంత్రం నాకు ఏ విషయం నువ్వు చెప్పాలి. మనం సినిమాకు వెళదాం... ఆరు గంటలకు థియేటర్ దగ్గరకు వచ్చెయ్యి'' అని ఏ థియేటర్ దగ్గరకు తులసి రావాలో చెప్పి వెళ్లిపోయాడు.

తులసి లోపలకు రాగానే భాగ్యం అడిగింది!

''ఎవరు? దయాసాగరేనా?''

''అవును పిన్నీ''

''అతన్ని కలుసుకోవద్దని ఎన్ని సార్లు చెప్పాలి.''

''కలుసుకోకుండా వుండలేను పిన్నీ...అతను చాలా మంచివాడు. నన్ను పెళ్లిచేసుకుంటానని అన్నాడు.''

''నేను వొప్పుకోను'' మొండిగా అన్నది భాగ్యం.

అప్పుడే పిన్నితో గొడవపడి అయినా దయాసాగర్‌ని పెళ్లి చేసుకోవడానికి నిర్ణయించుకుంది తులసి.

భాగ్యం ముభావంగా వుంది. ఆమె మౌనంగా వుండడంతో–

''దయాసాగర్ ఇల్లు అప్పుల వాళ్ల స్వాధీనం అవుతుందట. కనీసం యాభైవేలయినా వుంటే నిలుస్తుందట. నిన్నడిగి ఇప్పించమని చెప్పాడు.''

''నా కంఠంలో ప్రాణం వుండగా చిల్లిగవ్వ కూడా ఇవ్వను. నాకు ఇష్టంలేని మనుషులకు నేను డబ్బు ఇవ్వను'' అన్నది భాగ్యం.

ఆ రోజుసాయంత్రం ఐదు గంటలవుతున్నప్పుడు రైతు రామయ్య వచ్చాడు. తను కొన్న భాగ్యం పొలానికి అడ్వాన్స్‌గా లక్షరూపాయలను భాగ్యానికి ఇచ్చాడు. ఆ డబ్బును భాగ్యం బీరువాలో దాచుకున్నది.

సరిగ్గా అప్పుడే చలపతిరావు వూరు నుంచి వచ్చాడు. రామయ్య కాఫీ తాగి వెళ్లిపోయాడు.

సాయంత్రం ఆరుగంటలు కావస్తున్నప్పుడు తన స్నేహితురాలితో కలసి సినిమాకు వెళుతున్నానని ఇంట్లోనుంచి బయల్దేరింది తులసి. ఆమె బయటకు వస్తున్నప్పుడు భాగ్యం చలపతిరావుతో– ఒక్క రూపాయి కూడా ఇవ్వను. అని చెప్పడం తులసికి వినపడింది.

ఆమెకు సంతోషంగా అనిపించింది. భాగ్యం ఎవరికీ డబ్బు ఇవ్వనందుకు– దయాసాగర్‌కు ఇవ్వకుండా.

***

రాత్రి పదిగంటలు దాటుతున్నప్పుడు ఇంటికి వచ్చింది తులసి. రోడ్డు మలుపు తిరిగినప్పుడే ఇంటి బయట పోలీసు జీపు కనపడింది.

గబగబా నడిచి వచ్చేసరికి ఇంట్లో పోలీసుల హడావుడి, ఆ వీధిలో కొంతమంది మనుషులు కనిపించారు. వాళ్లను దాటి వెళ్లేసరికి హాల్లో మంచం పక్కన గచ్చుమీద నెత్తురుమడుగులో పడివున్న భాగ్యం కనిపించింది. శవాన్ని భయంగా చూసింది తులసి.

ఎవరో తులసిని ఇన్స్‌పెక్టర్‌కు పరిచయం చేశారు. ఇన్స్‌పెక్టరు అడిగిన మీదట తను దయాసాగర్‌తో కలిసి సినిమాకు వెళ్లినట్లు చెప్పింది.

పోలీసు పనులు జరుగుతున్నాయి.

ఇన్స్‌పెక్టర్ తులసిని ప్రశ్నలతో వేధిస్తున్నాడు. ఆమె తనకు తెలిసిన జవాబులు చెపుతోంది. ఆ వీధిలో వుంటున్న ఒకాయన భాగ్యం కోసం వచ్చి ఆమె హత్య చేయబడి వుండడం చూసి పోలీసులకు కబురు చేశాడు. ఆమెను ఎవరో కత్తితో పొడిచి చంపారు.

''ఈ హత్యను ఎవరు చేసి వుంటారు?'' ఇన్స్‌పెక్టర్ అడిగాడు.

''తెలీదు''

''ఎందుకు చేసి వుంటారు?''

''తెలీదు''

''ఇంట్లో డబ్బు, నగలు వున్నాయా?''

రైతు రామయ్య లక్ష రూపాయలు ఇచ్చిన సంగతి చెప్పింది తులసి. ఇన్స్‌పెక్టర్ చెప్పిన మీదట బీరువా తెరిచింది. అందులో డబ్బు లేదు. డబ్బుకోసమే భాగ్యం హత్య జరిగినట్లుగా నిర్ధారించుకున్నాడు ఇన్స్‌పెక్టరు.

చలపతిరావు, గౌరీపతి భాగ్యాన్ని డబ్బు అడగడం, ఆమె ఇవ్వననడం ఇన్స్‌పెక్టరుతో చెప్పింది.

''నువ్వు వెళ్లేటప్పుడు చలపతిరావు ఇంట్లోనే వున్నాడా?'' అడిగాడు ఇన్స్‌పెక్టరు.

''అవును''

''ఆయనే ఈ హత్య చేసి వుంటాడా?''

''తెలీదు''

ఆమెను వదిలి ఇన్స్‌పెక్టర్ శవం దగ్గరకు వెళ్లాడు. చావబోయేముందు భాగ్యం వేలిని నెత్తురులో ముంచి గచ్చుమీద ఏదో రాసే ప్రయత్నం చేసినట్లుగా అతనికి అనిపించింది. పరిశీలనగా చూశాడు. ఆ అక్షరాలు – తులసి–అని అనిపించింది. మూడో అక్షరం పూర్తిగా రాయలేదు. సగంలోనే ప్రాణం పోయివుంటుంది.

భాగ్యం కుడిచేతి చూపుడు వేలును చూశాడు ఇన్స్‌పెక్టర్. ఆ వేలికి నెత్తురు అంటుకుని లేదు. నెత్తురు అంటిన ఛాయలు కూడా లేవు.అంటే భాగ్యంను హత్య చేసిన మనిషి తులసి మీదకు అనుమానం రావాలని అలా రాసి వుండాలనుకున్నాడు. కాబట్టి అనుమానితుల జాబితా నుంచి తులసిని తీసేయ్యవచ్చు.

ఇన్స్‌పెక్టర్‌కు ఆ ఇంట్లో గౌరీపతి, చలపతిరావు డబ్బు కావాలంటూ భాగ్యానికి రాసిన ఉత్తరాలు కనిపించాయి.

కత్తి పిడి మీద వేలి ముద్రలు లేవు. హంతకుడి గురించిన ఆధారాలు దొరకలేదు. ఇక గౌరీపతిని, చలపతిరావునీ పిలిపించి ఎంక్వయిరీ చెయ్యాలి. రైతురామయ్యతో పనిలేదు. భాగ్యం చనిపోతే అతనికే నష్టం.

ఇలా ఆలోచిస్తూ ఇన్స్‌పెక్టర్ ఓ పక్కకి తిరిగి శవాన్ని చూస్తున్న తులసిని చూశాడు.

అతడి కళ్లు మెరిశాయి.

లైటు వెలుతురులో తులసి భుజం దగ్గర గులాబీరంగు జాకెట్టు మీద వున్న ఎర్ర రంగు నెత్తురు మరక కనపడింది.

వేలికి అంటిన నెత్తురు తలలో వున్న పూలను సర్దుకుంటున్నప్పుడు జాకెట్టుకు అంటి వుంటుంది.

''మీ పిన్నిని హత్య చేసినందుకు నిన్ను అరెస్టు చేస్తున్నాను'' అన్నాడు ఇన్స్‌పెక్టర్ తులసితో...

''నాకేం తెలీదు...చలపతిరావు మామయ్య చేసి వుంటాడు'' అన్నది తులసి కంగారుగా.

''కాదు తులసీ...సందేహం లేదు. నువ్వే హత్య చేశావు. ఆ నేరాన్ని నీ మీదకు నెట్టాలని ప్రయత్నించారని అనుకోవడానికి నువ్వే రక్తంలో నీవేలు ముంచి నీ పేరు రాశావు. కానీ నీ వేలికి అంటిన రక్తాన్ని తుడుచుకోవడం మరిచిపోయి వుంటావు. అది నీ జాకెట్టుకు అంటింది. పరీక్ష చేస్తే అది మీ పిన్ని రక్తం అని తేలిపోతుంది. మొత్తానికి తల్లీతండ్రి లేని నిన్ను చేరదీసినందుకు మీ పిన్నికి మంచి ప్రతిఫలాన్నే ఇచ్చావు.... ఈ విషయంలో నువ్వు బుకాయించినా ప్రయోజనం లేదు''

భాగ్యం మొండిమనిషనీ, డబ్బు ఇవ్వదనీ, దయాసాగర్‌కు సహాయపడాలనే వుద్దేశంతో సినిమాకు వెళుతున్నానని వెళ్లి తిరిగి వచ్చి తనే భాగ్యాన్ని కత్తితో పొడిచి డబ్బు తీసుకువెళ్లానని చెప్పింది తులసి.

''నేరస్థులు తప్పించుకోలేరు'' అన్నాడు ఇన్స్‌పెక్టర్.

★